క్లుప్తంగా

విగ్రహావిష్కరణకు తరలిరండి

కడ్తాల్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి గౌడ బంధువులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కల్వకుర్తి నియోజకవర్గ గౌడ్ సంఘం అధ్యక్షుడు చుక్కా అల్లాజీ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని గౌడ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు తరలిరానున్నట్లు ఆయన తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి

ఏఈ శ్రీనివాస్‌రావు

ఇబ్రహీంపట్నం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం విద్యుత్ ఏఈ శ్రీనివాస్ రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో, పట్టణాల్లో వ్యవసాయ పొలాల మధ్య ఉన్నా కరెంట్ స్తంభాలను, తడిగా ఉన్న ఇంటి గోడలను, మోటారు స్టార్టర్లను, తెగిపడిని విద్యుత్ వైర్లను, సర్వీస్ వైర్లను వాటిని తాకొదన్నాని తెలిపారు. ఇనుప తీగలపై బట్టలను ఆరవేయొద్దని, ఏదైన సమస్య ఉంటే విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అజాగ్రత్తగా వ్యవహరించి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని సూచించారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

తలకొండపల్లి: అర్హులైన రైతులందరు రైతు బీమా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా తమ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి దరఖాస్తులు కోరబడుచున్నవని ఏఓ కోరారు. పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, నామినీ యొక్క ఆధార్ కార్డుల జిరాక్స్ పత్రాలను, రైతు బీమా దరఖాస్తు ఫాంకు జత చేసి మీ గ్రామాల్లోని వ్యవసాయ విస్తరణాధికారులకు (ఏఈఓ) ఆగస్టు 5వ తేదీలోగా అందజేయ్యాలని ఏఓ చెప్పాడు. రైతు బీమభీమా పథకం కింద అర్హులైన రైతుల నామినీ చనిపోయినచో నామినీ మార్చుకునే వెసులుబాటు ఉందని, వారు ఈ నెల ఐబీఆర్30: మార్పులు, చేర్పులు చేసుకోగలరని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



కడ్తాల్: బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న కాంగ్రెస్ కార్యదర్శి బీక్యానాయక్

కడ్తాల్: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన పిక్లీ అనే మహిళ ఆకస్మికంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ ఆదివారం ఉదయం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన తెలిపారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యా నాయక్ , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, మాజీ సర్పంచ్ రాము నాయక్ , తులసీరాం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మలికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు



ఏఐసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలో కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎస్సీసెల్ అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా బలమైన శక్తిగా అవతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, శేఖర్‌గౌడ్, భరత్, తులసీరాం, ఇమ్రాన్‌బాబా, మహేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకుడు ప్రభు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేక్ కట్ చేసి, విద్యార్థులకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ క్రమంగా బలపడుతుందన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

మండల పరిధిలోగురుపౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక పూజలు, అన్నదానాలతో సాయిబాబా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇబ్రహీంపట్నం మండలంలోని సత్యనారాయణ గుట్టపై సాయిబాబా ఏక శిలా మందిరంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీరమ్య, వేణుగోపాల్‌రావులు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు హారతి, అభిషేకం, 108 కళశాలచే అభిషేకం, కనకాభిషేకం, సహస్ర పుష్పాభిషేకం, నిర్వహించారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని మంగళ్‌పల్లి సాయిబాబా దేవాలయం, కొంగరకలాన్ సద్గురు సాయిబాబా దేవాలయంలో ఆలయ ధర్మకర్తలు కల్వకోలు రవీందర్‌రెడ్డి దంపతులు నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితారెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.



కడ్తాల్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



యాచారం: సాయిధామంలో ప్రత్యేక పూజలు అందుకున్న సాయినాథుడు



ఇబ్రహీంపట్నం: సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్‌లో పూజలు చేస్తున్న ఏపీ మంత్రి నారాయణ సతీమణి



ఆమనగల్లులో సామూహిక వ్రతంలో భక్తులు



ఇబ్రహీంపట్నం: సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం



కడ్తాల్: అన్నదానం చేస్తున్న మాజీ సర్పంచ్ లక్ష్మినర్సింహారెడ్డి, భక్తులు



ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్‌లో మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ



మాడ్గుల:పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

మాడ్గుల: మండలంలోని చౌరస్తాలో ఆదివారం ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 26 నుంచి 28 హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో నిర్వహించనున్నారు. మాడ్గుల మండల ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో మార్పులు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస్, మల్లేష్, విజయ్, జంగయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల: ఈ నెల 26, 27 తేదిల్లో ఫొటో ట్రేడ్‌ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కోశాధికారి ఏర్పుల మల్లేశ్ తెలిపారు. ఎల్బీనగర్‌లోని కేబీఆర్ కన్వెషన్ హాల్లో రాష్ట్ర ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. ఆదివారం మంచాలలో దానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. మండల అధ్యక్షుడు పెద్ది రాజు, అనిత, యాదగిరి, శేఖర్, సతీష్, శ్రీనివాస్, జంగయ్య, భాస్కర్, వంశీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సహకారంతో బోరు మోటారు ఏర్పాటు

కొందుర్గు: మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి సహకారంతో ముట్పూర్ ఉన్నత పాఠశాలలో బోరు వేయించినట్లు గ్రామ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి తెలిపారు. పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి నవీన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారని, ఈ సందర్భంగా విద్యార్థుల కోరిక మేరకు ఆయన బోరు వేయించి, మోటార్ అమర్చి విద్యార్థులకు నీటికొరత లేకుండా చూస్తానని ఇచ్చిన హామీ మేరకు ఆదివారం బోరు వేయించామన్నారు.

ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట

ఉత్తమ పీఆర్వోగా పాషా



అవార్డు అందుకుంటున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిన లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు లయన్స్‌క్లబ్ జిల్లా 320ఏ పరిధిలో 2023–24 సంవత్సరానికి మొత్తం 12 అవార్డులు దక్కించుకుంది. లయన్స్‌క్లబ్ జిల్లా పరిధిలో ఉత్తమ క్లబ్‌గా ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఉత్తమ కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి, ఉత్తమ పీఆర్‌ఓగా పాషాలు అవార్డులు అందుకున్నారు. లయన్స్‌క్లబ్ జిల్లా 320 ఏ పరిధిలో ఉన్న 89 లయన్స్‌క్లబ్‌లలో 2023–24 సంవత్సరానికి నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గాను అవార్డులను అందించారు. హైదరాబాద్‌లోని బాటియా గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన లయన్స్‌క్లబ్ 320 ఎ ప్రతిభ అవార్డుల కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయణ్ బట్టడ్ అవార్డులను అందజేశారు. ఉత్తమ క్లబ్‌గా ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఉత్తమ జోన్ చైర్మన్‌గా శేఖర్‌రెడ్డి, ఉత్తమ కంటి వైద్య సహాయకుడిగా చంద్రశేఖర్, ఉత్తమ లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్‌లుగా మిట్టపల్లి అంజయ్య, బండెల రామచంద్రారెడ్డి, ఉత్తమ కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి, ఉత్తమ పీఆర్‌ఓగా పాషాలు అవార్డు అందుకున్నా రు. పసుల లక్ష్మారెడ్డి, జోన్ చైర్మన్ శేఖర్‌రెడ్డి ఉన్నారు.

చినుకుపడితే చిత్తడే..!

ఆమనగల్లు: పట్టణంలోని పలు కాలనీల్లో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. మున్సిపాలిటీగా ఏర్పాటైనప్పటికీ ఆమనగల్లు పట్టణంలో రోడ్లతీరు మాత్రం మారడంలేదు. సీసీరోడ్లు నిర్మించామని పాలకవర్గం చెబుతున్నా అనేక కాలనీలలో సీసీ రోడ్లు లేక మట్టి రోడ్లన్నీ చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతున్నాయి. పలు కాలనీలలోని రోడ్లపై నడిచివెళ్లడానికి సైతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు కాలనీల్లో అధ్వాన్నంగా మారిన రోడ్లను మరమ్మతులు జరిపించాలని, సీసీ రోడ్లు నిర్మించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



ఆమనగల్లు: విద్యానగర్ కాలనీలో చిత్తడిగా మారిన రోడ్డు

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: ఎడ తెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. కురుస్తున్న వర్షాలకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భూమి నాని కరిగటుట్ల చేసుకోవడానికి అనువుగా ఉందని, మండలంలోని ఆయా గ్రామాల రైతులు వరి పంట వేయడం కోసం కరిగట్టును సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలో వ్యవసాయ సాగు విస్తీర్ణం 30వేల ఎకరాలుండగా ఇప్పటి వరకు 18వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. 68 శాతం వరకు వివిధ రకాల పంటల విత్తనాలు నాటడం పూర్తయ్యిందని వ్యవసాయాధికారులు చెప్పారు.



తలకొండపల్లి: ట్రాక్టర్‌తో కరిగట్టు చేస్తున్న రైతు

కనీస వేతనాలివ్వాలి

సీఐటీయూ ఉపాధ్యక్షుడు భూపాల్

ఇబ్రహీంపట్నం రూరల్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.భూపాల్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ సీఐటీయూ కన్వీనర్ తులసీగారి నర్సింహ ఆధ్వర్యంలో ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్‌లోని కల్లెం జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐటీయూ నాయకులు ఎం .భూపాల్, కేవీపీఎస్ అధ్యక్షుడు స్కైలాబ్‌బాబు విచ్చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని, పూర్తిగా విఫలం అయ్యాయని తెలిపారు. కార్మికుల పక్షాన నిలబడే సంఘం సీఐటీయూ మాత్రమేనన్నారు. పేదల హక్కుల సాధనే లక్ష్యంగా నిరంతరం పోరాటం చేస్తున్నట్లు వివరించారు. అధ్యక్షుడిగా అనిల్, కార్యదర్శి బాబు, ఉపాధ్యక్షుడు జగన్, కోశాధికారి ఉపేందర్, సదానందం, సహాయ కార్యదర్శిగా రమేష్, కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీ. సామేలు, సీపీఎం మండల కార్యదర్శులు చాత్కాల జంగయ్య, ఆలంపల్లి నర్సింహ, బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కోరారు. వెల్దండ మండలం కేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్‌హాలులో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షల కోసం వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందించారు. అనంతరం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యాలుగా ఐక్యత ఫౌండేషన్ పనిచేస్తుందని చెప్పారు. ఈ నెల 27 వరకు నిర్వహించే కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, నరేందర్‌గౌడ్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌గౌడ్, దళపతిగౌడ్, మల్లయ్య, రమేశ్‌నాయక్, కొండల్‌యాదవ్, శివ, సలీం, యూసుఫ్‌బాబా, అభినవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతుహ్యాపీ

- రూ. లక్ష వరకు విముక్తి
- మండలంలో 3,851 మందికి లబ్ధి
- రూ. 23,31,31,778 నేరుగా రైతు ఖాతాలో జమ



మండల కేంద్రంలోని తోటలో కలుపు మిషన్‌తో కలుపు తీస్తున్న రైతు

తలకొండపల్లి: పంట రుణాల మాఫీ చేసి రూ. లక్ష వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసింది. దీంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. 2018 డిసెంబర్ 12 నుంచి, 2023 డిసెంబర్ 9 వరకూ తీసుకున్న రుణాలకు ప్రభుత్వం మాఫీ చేసింది. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు రూ. 2లక్షల వరకు ఏక కాలంలో ఆగస్టు 15 లోగా చేయనున్నట్లు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు ప్రభుత్వం కసరత్తు చేపట్టి రుణమాఫీకి ఏవరు అర్హులు, విధి విధానాలు ఏ విధంగా ఉండాలి? అని చర్చించి ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చింది. మార్గ దర్శకాలను జారీ చేసింది. ఈ సందర్భంగా భూమి ఉన్న ప్రతి కుటుంబానికి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ జరుగుతుందని, పాస్‌బుక్ ఆధారంగా చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రైతు కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్‌కార్డు నిబంధన విధించామని, రేషన్‌కార్డు లేని రైతులు ఆందోళన చెందొద్దని, వారికి కూడా రుణమాఫీ జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. రేషన్‌కార్డు నిబంధన కేవలం కుటుంబ నిర్ధారణ కోసమేనని, కార్డు లేని వారి గురించి వ్యక్తిగత విచారణ చేపట్టి, ఇంట్లో ఎంత మంది ఉంటున్నారు. ఎవరి పేరిట రుణం ఉందనే వివరాలు పరిశీలించి రూ. 2 లక్షల రుణమాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఎవరైనా తప్పుడు సమాచారమిచ్చి ప్రభుత్వం ప్రకటించిన రూ. 2 లక్షల రుణమాఫీని పొందితే ఆ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని సంబంధిత వ్యవసాయాధికారులు చట్టప్రకారం రికవరీ చేస్తారు. రుణమాఫీకి అర్హులు కాని వారి విషయంలో మాత్రమే ఇది వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. మూడు విడతల వారీగా రూ. 2 లక్షల రుణమాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 18న రూ. లక్ష వరకు ఉన్న పంట రుణం మాఫీ చేసి ఆ డబ్బులను నేరుగా రైతు ఖాతాల్లో జమ చేసింది. రూ. లక్షన్నర రుణమాఫీని జులై నెలఖారులోగా. రూ. లక్షన్నర పైన ఉన్న రుణమాఫీని (రూ. 2 లక్షల వరకూ) ఆగస్టు 15 లోగా చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆ దిశలో ప్రభుత్వం ముందుకు వెళుతుంది. తలకొండపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులకు మొదటి విడుతలో రూ. లక్ష రుణమాఫీకి 3,851 మంది రైతులకు రూ.23,31,31,778లు నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేసినట్లు ఏఓ రాజు తెలిపారు.

సంతోషంగా ఉంది



సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ. లక్ష రైతు రుణమాఫీ చేయడం చాలా సంతోషంగా ఉంది. తలకొండపల్లి యూనియన్ బ్యాంక్‌లో రూ. 99,000లు రుణం తీసుకున్నాను. మాఫీ అయినట్లు లిస్టులో పేరు వచ్చింది. పట్టరాని ఆనందంతో రుణమాఫీ సంబురాలు జరిపాం. వ్యవసాయం చేయాలంటే విరక్తి కలిగేది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడంతో వ్యవసాయం చేయాలని ఆసక్తి కలుగుతుంది.

– నర్సమ్మ, రైతు, తలకొండపల్లి

ఇచ్చిన హామీ నిలబెట్టుకుంది



అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తోంది. అధికారంలోకి వచ్చినప్పటి నంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేయాలని తీసుకున్న నిర్ణయం మేరకే ఏక కాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేశారు. అది చారిత్రాత్మకమైన నిర్ణయం. చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగింది.

– మోహన్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి

ఘనంగా మహంకాళి బోనాలు

ఇబ్రహీంపట్నం,యాచారం పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం మహంకాళి బోనాలు ఘనంగా నిర్వహించారు. బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. మహిళలు బోనాలతో గ్రామంలోని పలు కాలనీల నుంచి ఊరేగింపుగా అమ్మవారి దేవాలయం వద్దకు వెళ్లి పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



ఇబ్రహీంపట్నం: మహంకాళి అమ్మవారు



ఇబ్రహీంపట్నం: బోనాలతో మహిళలు



ఇబ్రహీంపట్నం: అమ్మవారి భారీ విగ్రహం



చింతపట్లలో పోతురాజుల విన్యాసాలు